క్లుప్తంగా

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిరూరల్: ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. పెద్దపల్లి ఏసీపీగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు కావొద్దన్నారు. గంజాయి, డ్రగ్స్‌తో పాటు నేరాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు


బోనాలతో ముదిరాజ్ కులస్తులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దమతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి మహిళలు బోనాలు నైవేద్యంగా పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


సాత్విక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సెయింట్ క్లేర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి జూలపల్లి సాత్విక్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 16, 17వ తేదీల్లో గుజరాత్‌లోని యూనివర్సిటీ మైదానంలో జరగనున్న ఆలిండియా అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటాడని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గట్టయ్య తెలిపారు. ఈసందర్భంగా సాత్విక్‌ను హెచ్‌ఎం ఫాదర్ డామినిక్, పీఈటీ సుదేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో పర్యటన

రామగుండం: అంతర్గాం ఎంపీడీవో అలీం గురువారం క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా గోలివాడ గోదావరి నది ఒడ్డున జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జాతర కమిటీ చైర్మన్ పెండ్రు హన్మాన్‌రెడ్డికి భక్తుల సౌకర్యాలపై ఎంపీడీవో పలు సూచనలు, సలహాలిచ్చారు. ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, ఎంపీటీసీ కొలిపాక శరణ్య, జాతర కమిటీ ప్రతినిధి కోల రామ్మూర్తిగౌడ్ ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


కోలాటం ఆడుతున్న మహిళలు

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి గ్రామంలో శ్రీలక్ష్మి గోదాసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గురువారం విగ్రహాల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉదకశాంతి, శాంతి మంత్ర పాఠం, ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ సముద్రాల అశోక్‌రావు, మాజీ ఎంపీపీ కొడారి అంజయ్య, ఎంపీటీసీ దాడి సదయ్య, మాజీ సర్పంచ్ పాలకుర్తి సత్తయ్య, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన తీర్మానంపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

రామగుండం: కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో కులగణన చేపట్టే తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో అంతర్గాం జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం కులాల జనాభా ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేయొచ్చని, కులాల వారీగా జనాభాకు బడ్జెట్ కేటాయింపులను పరిశీలనలోకి తీసుకోవచ్చన్నారు. సంబరాల్లో పార్టీ ప్రజాప్రతినిధి కొక్కెర రమేశ్, ఉరిమెట్ల రాజలింగం, శ్రీనివాస్, మద్ది వెంకటేశ్‌గౌడ్, అప్పాల రాజేందర్, రాజు, జలీల్, కిరణ్, తమ్మనవేణి కోటి, ఉప్పుల వెంకటేశ్, ఊరటి మహేశ్ ఉన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రం రామునిగుండాల

- శ్రీరామపాదక్షేత్రంలో 18ఏళ్లుగా విశేష పూజలు


తొలిరోజుల్లో తాత్కాలిక షెడ్డులో శ్రీవేంకటేశ్వరుడి గుడి

రామగుండం: పట్టణంలోని రామునిగుండాల కొండ ఆధ్యాత్మిక ప్రాంతంగా పేరు పొందింది. రాముడు నడయాడిన నేల కావడంతో రామగుండంగా పేరు వచ్చింది. 2006 ఏప్రిల్ (వైశాఖమాసం)లో ఓ మేకల కాపరి కొండపైకి మేకలను మేపడానికి తీసుకెళ్తున్న క్రమంలో రాతి విగ్రహం కింద పడి ఉండడాన్ని గుర్తించి అందరికీ సమాచారమిచ్చాడు. స్థానికులు స్పందించి రాతి విగ్రహాన్ని పరిశీలించగా శ్రీవేంకటేశ్వరుడి రాతి విగ్రహంగా గుర్తించి పూజలు ప్రారంభించారు. 2009 డిసెంబర్ 28న శ్రీలక్ష్మీ నర్సింహస్వామి సుదర్శన హోమ కార్యక్రమాన్ని 50 మంది అహోబిల రామచంద్ర జీయర్‌స్వామి శిష్యుల బృందం ఈ ప్రాంత ప్రాశస్త్యం గురించి విశేష అవగాహన కల్పిస్తూ పూజలు చేశారు. 2010 జనవరి 2న శ్రీశ్రీశ్రీత్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి సందర్శించి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రతి ఏటా శ్రావణం, కార్తీకమాసంలో భక్తులు అధికంగా వస్తారు.

ఆలయానికి దైవ చరిత్ర ఉంది



రామునిగుండాల కొండపై ఉన్న శ్రీరామపాదక్షేత్రానికి ఎంతో దైవ చరిత్ర ఉంది. శ్రీరాముడు–సీతాదేవి సంచరించిన ప్రాంతం కావడంతో పైనున్న కొండపై అనేక దేవతామూర్తుల విగ్రహాలు ఉన్నాయి. అందుకే రథసప్తమి వేడుకలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. – మేడి తిరుపతి, ఆలయ ధర్మకర్త

సోచ్ ఫౌండేషన్‌కు విద్యార్థుల విరాళం


విరాళాలు అందిస్తున్న గాయత్రి విద్యార్థులు


విరాళాలు సేకరిస్తున్న జూపిటర్ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు సోచ్ ఫౌండేషన్ ద్వారా అంధులైన కళాకారులకు రూ.51,550 అందజేశారు. మానసిక దివ్యాంగులు, అంధులు, అనాథల సంక్షేమం కోసం ఇంట్రాడ్ సోచ్ సంస్థ 20ఏళ్లుగా పాటుపడడం అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ రజనీ, విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ కొనియాడారు. విరాళాలను అందించిన విద్యార్థులను అభినందించారు.

అంధుల సహాయార్థం..

జూలపల్లి: మండల కేంద్రంలోని జూపిటర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు అంధులకు సాయం చేసేందుకు విరాళాలు సేకరించారు. అనాథలకు, అంధులకు సేవ చేస్తున్న సోచ్ అనే స్వచ్ఛంద సంస్థ యజమాన్యానికి చెందిన కోఆర్డినేటర్ హరికి వారు సేకరించిన రూ.40,095 అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, హెచ్‌ఎం అందె కుమార్ ఉన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశమివ్వండి


వినతిపత్రం ఇస్తున్న కారెంగుల శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్/ఓదెల: రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీ పెద్దపల్లి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని పార్టీ ఓదెల మండల అధ్యక్షుడు కారెంగుల శ్రీనివాస్ కోరారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌ను కోరారు. పార్టీ పటిష్టత కోసం పాటుపడుతున్న తనకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. నాయకులు తాత రవి, రాజన్నపటేల్, మహేశ్, రమేశ్, నిఖిల్, మధు ఉన్నారు.

సమ్మక్కకు ఎత్తు బంగారం మొక్కులు



సుల్తానాబాద్: వన దేవతలైన సమ్మక్క– సారలమ్మకు భక్తులు ఎత్తు బంగారం మొక్కులు సమర్పిస్తున్నారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో దుకాణాల వద్ద ఎత్తు బంగారం మొక్కుల సందడి నెలకొంది. మేడారం వెళ్లే భక్తులు ముందుగా ఇంటి వద్ద మొక్కులు సమర్పించిన తర్వాత జాతరకు వెళ్తారు.

సంక్షిప్త వార్తలు

సమ్మక్క జాతరకు ఏర్పాట్లు

గోదావరిఖని: గోదావరిఖని గోదావరి తీరంలో 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జాతర ఈవో కాంతారెడ్డి, కమిటీ అధ్యక్షుడు పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 21న సాయంత్రం సారలమ్మ రాక, 22న ఉదయం కంకవనం తీసుకురావడం, 22న రాత్రి సమ్మక్క తల్లి గద్దెకు వస్తుందన్నారు. 23న భక్తుల మొక్కులు ఉంటాయన్నారు. 24న భక్తుల దర్శనం అనంతరం రాత్రి అమ్మవార్ల వనప్రవేశం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

దాడి కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష

గోదావరిఖనిటౌన్: యైటింక్లయిన్‌కాలనీ రాజీవ్‌నగర్‌కు చెందిన పాలిత సురేశ్‌పై నేరం రుజువు కావడంతో గురువారం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గోదావరిఖని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జూనియర్ జడ్జి, రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ వెంకటేశ్ తీర్పు ఇచ్చారు.

బసంత్‌నగర్‌లో గ్రామసభ

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లో పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి, స్పెషల్ ఆఫీసర్ షబ్బీర్‌పాషా పాల్గొని గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. నాయకులు కట్టికోల వేణుగోపాలరావు, పాత రవీందర్, కన్నం వెంకటేశ్, ముస్తాక్ పాల్గొన్నారు.

ధూళికట్టలో..

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో గ్రామసభ నిర్వహించారు. ధూళికట్ట గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీటీసీ సావిత్రమ్మ, మాజీ సర్పంచ్ కావేరి, కార్యదర్శి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని రాయపేట గ్రామానికి చెందిన ఉమ్మారెడ్డి హర్షితకు రూ.75వేల విలువ గల ఎల్‌వోసీ చెక్కును పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు గురువారం తన నివాసంలో బాధిత కుటుంబానికి అందించారు. కాంగ్రెస్ నాయకులు మ్యాకల జనార్దన్‌రెడ్డి, జనుమాల రాజు, సొల్లేటి భూమిరెడ్డి పాల్గొన్నారు.

నర్సరీ, పల్లె ప్రకృతివనం పరిశీలన

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో పల్లె ప్రకృతి వనం, నర్సరీ, ఉపాధిహామీలో జరుగుతున్న కెనాల్ వర్క్ పనులను గురువారం ఎంపీడీవో వై.భాస్కర్‌రావు సందర్శించి పనులను పరిశీలిచారు. వివరాలు అడిగి తెలుసుకుని సలహాలు, సూచనలు చేశారు. కార్యదర్శి అభిజిత్, ఉపాధిహామీ టీఏ, మాజీ సర్పంచ్ గొల్లె కావేరి ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

గోదావరిఖని: సింగరేణిలో శుక్రవారం జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాంచ్ ఉపాధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, ఎస్‌కే గౌస్, శంకర్, వంగల శివరాంరెడ్డి, రహీం పాల్గొన్నారు.

బంద్‌కు మద్దతుగా నిరసన చేస్తాం

జ్యోతినగర్: కేంద్ర విధానాలకు నిరసనగా చేపట్టనున్న గ్రామీణ భారత్‌బంద్‌కు మద్దతుగా ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు గేట్–1 వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టనున్నట్లు ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్(ఐఎన్టీయూసీ) ఆధ్వర్యంలో చేపట్టే నిరసనలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అనుమతి లేనివి విక్రయిస్తే కఠిన చర్యలు

జూలపల్లి: ప్రభుత్వ అనుమతి లేని ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తే దుకాణాల లైసెన్సు రద్దుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు వడ్కాపూర్‌లోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ప్రత్యూషతో కలిసి తనిఖీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ధర్మారం: మండలంలోని నందిమేడారంలో గురువారం తహసీల్దార్ రజిత గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ప్రముఖ వ్యాపారి సుద్దాల రమేశ్ మృతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని ప్రముఖ వ్యాపారి, ఎన్టీపీసీ శ్రీవాసవి మాత సేవా సమితి అధ్యక్షుడు, ఎన్టీపీసీ పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు సుద్దాల రమేశ్(56) గురువారం మృతి చెందాడు. ఎన్టీపీసీ రామగుండం భీమునిపట్నంలో నివసిస్తున్న సుద్దాల రమేశ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో గురువారం ఆయన మృతి చెందాడు. ఎన్టీపీసీ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి రాజు సంతాపం తెలిపారు.

అమరవీరులకు నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: పుల్వామా బాంబుదాడిలో అమరులైన వారికి గురువారం స్థానిక ప్రధాన చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు రవీందర్, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

గోదావరిఖని: సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. కాస్మోటాలజీ (మహిళలు), డ్రోన్, సోలార్, సెల్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. కాస్మోటాలజీ కోర్సుకు ఏలాంటి విద్యా అర్హత అవసరం లేదని, ఇతర కోర్సులకు డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 20 మందికి శిక్షణ ఇస్తారని 18 నుంచి 42 ఏళ్ల వయసున్న యువతీ యువకులు తమ దరఖాస్తులను సమీప ఎంవీటీసీలో నేరుగా సమర్పించాలని పేర్కొన్నారు.


టోకెన్ సమ్మెకు బీఎంఎస్ దూరం

గోదావరిఖని: సింగరేణిలో జరిగే టోకెన్ సమ్మెకు బీఎంఎస్ దూరంగా ఉంటుందని ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ కుట్రతో దేశంలో సమ్మెకు పిలుపునిచ్చారని దీనికి వ్యతిరేకమన్నారు. కార్మికులు సమ్మెలో పాల్గొనాల్సిన అవసరం లేదన్నారు.

ఉద్యోగులకు ఆటంకం కలగకుండా చూడాలి

రామగిరి: కార్మిక సంఘాలు శుక్రవారం తలపెట్టిన సమ్మెలో కార్మికులు పాల్గొనవద్దని, విధులకు హాజరయ్యే ఉద్యోగులకు ఆటంకం కలగకుండా చూడాలని ఏపీఏ, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎంలు కె.వెంకటేశ్వర్లు, ఎన్.రాధాకృష్ణ అన్నారు. గురువారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా సెక్యూరిటీ విభాగం, పోలీసు సిబ్బంది సహకారంతో ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకరోజు సమ్మె చేయడంతో సంస్థ నష్టపోయే ఉత్పత్తి సుమారు రూ.85 కోట్లు ఉంటుందని, అలాగే కార్మికులు సుమారు రూ.18 కోట్ల వేతనాలు కోల్పోతారన్నారు. సింగరేణి అధికారులు పి.ఏలీషా, జి.రఘుపతి, పి.శ్రీనివాసులు, చంద్రశేఖర్, పద్మరాజు, ముప్పిడి రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం



ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తి మాజీ సర్పంచ్ రెడపాక ప్రమీల–శ్రీనివాస్‌ను గురువారం పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి


సన్మానిస్తున్న ఎంపీపీ నూనేటి సంపత్

కాల్వశ్రీరాంపూర్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ నూనేటి సంపత్ అన్నారు. మండలంలోని మంగపేటలో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్‌లో పని చేసిన పారిశుద్ధ్య కార్మికులను గురువారం కార్యదర్శి రాజ్‌కుమార్, ఆప్షన్ సభ్యుడు నారాయణ, పశువైద్యాధికారి, పంచాయతీ స్పెషలాఫీసర్ డాక్టర్ సునీత పాల్గొన్నారు.

‘బిరుదు’ ఆశయ సాధన కోసం కృషి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సుల్తానాబాద్: మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఆశయ సాధనకు కృషి చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన గృహం సమీపంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపులో మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కృషి ఉందన్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. బిరుదు రాజమల్లు జీవిత చరిత్రకు చెందిన బుక్‌ను ఆవిష్కరించారు.

ట్రస్ట్ ఏర్పాటు చేయాలి..

బిరుదు రాజమల్లు పేరిట పేదరిక నిర్మూలన కోసం ట్రస్టు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. సంతాప సభకు హాజరై మాట్లాడారు. తనవంతు సహకారం కుటుంబానికి ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బిరుదు సమత, ఎంపీపీ బాలాజీరావు, బీఆర్‌ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కన్నారావు, బిరుదు రాధాకృష్ణ, శ్రీనివాస్ అనిల్, సంతోష్‌కుమార్, బిరుదు సుశీల, గిరిప్రసాద్, సాయిబాబా, కల్లేపల్లి జానీ, గోపగాని సారయ్యగౌడ్, అన్నయ్యగౌడ్, ప్రకాష్‌రావు, సామల హరికృష్ణ, పెద్దన్న, ముస్త్యాల రవీందర్, సాయిరి మహేందర్, రాజన్న, వివేక్ పటేల్, రాజేశ్, గడ్డం వంశీ, సీఎస్సార్, రామ్మూర్తి, జెడ్పీటీసీలు తిరుపతిరెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో గురువారం శ్రీసీతారామాంజనేయ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మెలో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలి


మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టే సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని సింగరేణి యూనియన్ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ఆర్‌వీఆర్ ఓబీ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికులు, ప్రజలు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. తిరుపతి, రమేశ్, మొగిలి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం చేపట్టే భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కోరారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్–3లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో బంద్ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. దేశాయినాయక్, రాము, వెంకటేశ్, రవి, పద్మ, సతీశ్, నీలమ్మ, రాంబాయి, శ్రీను, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ, వైద్య సిబ్బంది సేవలు మరువలేనివి


సన్మానిస్తున్న ఎంపీపీ స్రవంతి

ఎలిగేడు: గ్రామాల్లో పంచాయతీ, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు మరువలేనివని ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా చివరి రోజు గురువారం ప్రత్యేక అధికారి, సెక్రటరీల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో వారంరోజులుగా చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎంపీవో అనిల్‌రెడ్డితో కలిసి ఎంపీపీ సమీక్షించారు. పారిశుద్ధ్య కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేసిన పంచాయతీ సిబ్బందిని సన్మానిచారు. ఉత్తమ జాతీయ(కాయకల్ప) అవార్డుకు ఎంపికైన సుల్తాన్‌పూర్ పల్లె దవాఖాన వైద్యసిబ్బందిని అభినందించి, సన్మానించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ స్వర్ణ, కార్యదర్శి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్‌సేవాలాల్ జయంతి


నివాళి అర్పిస్తున్న లంబాడీలు


పూజలు చేస్తున్న తండావాసులు

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని ఎస్టీ కాలనీలో గురువారం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండాలో గురువారం గిరిజనుల ఆరాధ్యదైవం భగవాన్ శ్రీసంతు సేవాలాల్ జయంతి నిర్వహించారు. భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

రామగిరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చివరి రోజులో భాగంగా కల్వచర్ల, బుధవారంపేట గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని సూచించారు. ఎంపీటీసీ కొట్టె సందీప్, కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై పరిశీలన

రామగుండం: సమ్మక్క జాతర ప్రాంగణానికి సమీపంలోనే ఉన్న ఎన్టీపీసీ ప్రహరీ, పిల్లర్లను సత్వరమే తొలగించి భక్తులకు సహకరించాలని అంతర్గాం తహసీల్దార్ పనగంటి రామ్మోహన్‌రావు ఎన్టీపీసీ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్, ఎంపీడీవో, ఆలయ ఈవో తదితరులు జాతర ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్లు, పార్కింగ్ స్థలం, తాగునీరు అంశాలపై జాతర కమిటీ చైర్మన్ పెండ్రు హన్మాన్‌రెడ్డి, ఈవో రాజ్‌కుమార్‌తో చర్చించారు.

నేషనల్ ఒలింపియాడ్ విజేతలకు అభినందన



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి పాఠశాల విద్యార్థులు నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ మేరకు విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు.

ఉపాధి పనులపై ఎంపీడీవో ఆరా

ఓదెల: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఎంపీడీవో తిరుపతి గురువారం ఆరా తీశారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన ఎంపీడీవో మండలంలోని కూలీలు ఎంతమంది, జాబ్‌కార్డులు ఎంతమందికి ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పనిచేసిన కూలీలకు కూలీడబ్బులు అకౌంట్‌లో జమ అవుతున్నాయా అని ఏపీవోను అడిగారు.